

రంజాన్ వేళలు

ఇఫ్తార్ - శనివారం
సాయంత్రం - 6:34

సహర్ - ఆదివారం
ఉదయం - 4:49



చౌదరిగూడ మండలం ఎదిరలో ఎండిన వరిచేను

మండుతున్న ఎండలు... అడుగంటుతున్న భూగర్భజలాలతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పంట పొలాలు మాడిపోతున్నాయి. వానాకాలంలో చవిచూసిన నష్టాలను యాసంగిలోనైనా పూడ్చుకోవాలని ఉన్న కొద్దిపాటి నీటి వనరులతో రైతులు ఎన్నో ఆశలతో సాగు చేశారు. అక్కడక్కడ సాగు చేసిన పంటలు ఏపుగా పెరుగుతున్న తరుణంలో బోర్లలో నీరు రావడం నిలిచి పోయి అన్నదాతకు గుండె కోతగా మారుతున్నాయి. పంటలకు ఇప్పుడు నీరు ఎక్కువగా అవసరమవుతున్న తరుణంలో భూగర్భజలాలు అడుగంటి పోవడంతో కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఎండిన వరిచేలు పశువులకు మేతగా మారాయి.

కరువు కోరలు!

ఉమ్మడి జిల్లాలో మండుతున్న ఎండలు.. ఎండుతున్న పంటలు

పశువులకు మేతగా మారిన వరిచేలు

- నెర్రెలు వారుతున్న పొలాలు
- రంగారెడ్డి జిల్లాలో 3.68 మీటర్ల లోతుకు పడిపోయిన భూగర్భజలాలు
- ఆగి ఆగి పోస్తున్న బోర్లు.. దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- వికారాబాద్‌లో 20వేలు, రంగారెడ్డిలో 1500 ఎకరాల్లో పంటలు ఎండుముఖం
- మరో వారం, పది రోజులైతే భయంకరంగా పరిస్థితులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/పరిగి/ఇబ్రహీంపట్నం/చౌదరిగూడ, మార్చి 29 : ఉమ్మడి జిల్లాలో మండిపోతున్న ఎండలు.. ఎండుతున్న చెరువులు, కుంటలు, అడుగంటుతున్న బోరు బావులతో రైతులు అల్లాడుతున్నారు. ముదురుతున్న ఎండలతో రోజురోజుకూ నీటి నిల్వలు పాతాళంలోకి పడిపోతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి మరింత భయంకరంగా ఉండే పరిస్థితులు గోచరిస్తున్నాయి. పంట చేతికందే సమయంలో నీరందక పొలాలు ఎండిపోవడంతో రైతుల గుండెలు పగులుతున్నాయి. బోరు బావులను నమ్ముకుని వరి పంట సాగుచేసిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. కూరగాయ పంటలు చేతికందే సమయానికి నీరందక ఎండిపోతున్నాయి. యాచారం మండలం ఏనెకింది తండా, మంతనిగౌరెల్లి, నల్లబెల్లి గ్రామాలు, మంచాల మండలంలో వరిపంటతో పాటు కూరగాయ పంటలు ఎండిపోతున్నాయి. ట్యాంకర్ల ద్వారా నీరుపోసి పంటను బతికించుకునేందుకు రైతులు ప్రయత్నం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం రాయిన్‌గూడ ఏరియాలో చిన్న రైతులు వ్యవసాయానికి తోడు బాయిలర్ కోళ్ల ఫాంలు నడుపుతున్నారు. బోరుబావులు ఎండిపోవడంతో వాటి దప్పిక తీర్చడం కోసం ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేసి తాపుతున్నారు.



చౌదరిగూడలోని తుమ్మలపల్లిలో దారగా పోస్తున్న బోరు

వికారాబాద్ 20వేలు, రంగారెడ్డిలో 1500 ఎకరాలు ఎండిన పంట

వికారాబాద్ జిల్లాలో ప్రధానంగా పరిగి, దోమ, కులకచ్ల, బొంరాసిపేట్, కొడంగల్, దౌల్తాబాద్, యాలాల, తాండూరు తదితర మండలాల్లో వరితో పాటు ఇతర పంటలు ఎండుముఖం పడుతున్నాయి. జిల్లాలో మొత్తం 1,25,129 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. భానుడి తాపానికి భూగర్భ జలాలు అడుగంటుకుపోయి సాగు చేసిన పంటల్లో 30శాతం ఎండుముఖం పట్టాయి. జిల్లాలో వరి పంట 84,100 ఎకరాల్లో సాగు చేయగా సుమారు 20వేల ఎకరాలకుపైగా ఎండిపోయింది. సాగుకోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో రైతన్నలు మదనపడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో 1500 ఎకరాల్లో వరి, కూరగాయ పంటలు ఎండుముఖం పట్టినట్లు సమాచారం. జిల్లాలోనే వరి దిగుబడిలో నెంబర్‌వన్ స్థానంలో ఉన్న దండుమైలారంలో 1,100 ఎకరాల్లో సాగుచేయగా ఇప్పటికే 20శాతం మేర పంట చేలు ఎండుముఖం పట్టింది. దీంతో వరి పంటను పశువులకు మేతగా వదిలేస్తున్నారు. పంటసాగుకు చేసిన పెట్టుబడులు మీద పడుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని మంచాల, యాచారంలో వరి, కూరగాయ పంటలు కలిపి 17200 ఎకరాల్లో సాగుచేశారు. అందులో 710ఎకరాల్లో పంటలు ఎండుముఖం పట్టాయి. కందుకూరుమండలంలో ఐదు ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని కాస్లాబాద్, ఎదిర, చేగిరెడ్డి ఘణాపూర్, జాకారం, పీర్జాపూర్ తదితర గ్రామాల్లో బోరుబావుల్లో నీటిమట్టాలు పడిపోయాయి. మండల పరిధిలో 4007ఎకరాల్లో వరి సాగు చేయగా.. దాదాపు 40ఎకరాల వరకు ఎండుముఖం పట్టింది. ఇబ్రహీంపట్నం మండలంలోని రాయపోల్ పంచాయతీ, రాయిన్‌గూడ రెవెన్యూలో పాంబండ, టేకుల బోడులో కోల్ బాయి, గుండొంబాయి, అల్లంతోట బాయి, అంతన్నబాయి, బుర్జుగడ్డబాయి, కుంట్లబావుల కింద సుమారు 40ఎకరాల్లో వరి, కూరగాయల తోటలు ఎండిపోయాయి.



ఇబ్రహీంపట్నం రాయిన్ గూడలో ఎండిన బోరు

పోటాపోటీగా బోర్లు

అడుగంటిపోతున్న భూగర్భజలాలతో పంటలు ఎండిపోవడాన్ని చూడలేక రైతులు పోటాపోటీగా బోర్లు వేసి బుగ్గిపాలవుతున్నారు. అప్పులు చేసి ఒక్కో రైతులు ఐదారు బోర్లు వేసి చుక్కనీరు రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. వికారాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో దాదాపుగా 60 వేల బోర్లు ఉన్నాయి. ఇంకా నీళ్ల పడని బోర్లు లక్షకు పైగా ఉంటాయి. ఈ నెలలో దాదాపు ఐదు వేలకు పైగా బోర్లు కొత్తగా వేసినట్లు అంచనా. అయితే ఐదు నుంచి ఏడు ఎనిమిది వందల ఫీట్ల లోతు వేసినా నీళు రావడం లేదని రైతులు వాపోతున్నారు. వరిపొట్టకొస్తున్న సమయంలో సరిపడా నీరు లేక పంటలలను కాపాడుకోవడం తలకు మించిన భారమవుతోందని రైతులు బోరుమంటున్నారు.

అడుగంటిన భూగర్భజలాలు..

రంగారెడ్డి జిల్లాలో గతేడాది.. ఈఏడాది మార్చితో పోల్చుకుని చూస్తే సగటు భూగర్భజలాల నీటిమట్టం 3.68మీటర్ల లోతుకు వెళ్లింది. దాంతో బోర్లు ఆగి ఆగి పోస్తున్నాయి. కొన్నిచోట్ల బోర్లలో నీరు అడుగంటిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అక్కడక్కడా ట్యాంకర్ల ద్వారా నీరందించి పంటలను బతికించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు రైతులు వ్యవసాయ బావుల్లో పూడికతీత పనులు చేపట్టారు. మరి కొందరు అప్పులు చేసి బోర్లు వేయిస్తున్నారు.



ఇబ్రహీంపట్నం రాయపోల్‌లో టమాట పంట..

ఎండిపోయే పరిస్థితులు వాస్తవమే



జిల్లాలో ప్రస్తుతానికి పంటలు ఇంకా ఎండిపోలేదు. ఎండిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. భూగర్భజలాలు తగ్గిపోతున్నమాట వాస్తవమే. పరిస్థితులు ఇలాగే ఉంటే ఆందోళనకరమే.

- గోపాల్, వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి

800 ఫీట్లు బోరు వేసినా చుక్క నీరురాలే..



రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశా, అందులో ఎకరం ఎండిపోయింది. గింజ పాలు పోసుకునే దశలో ఉన్న చేనైనా చేతికొస్తుందా అని అనుమానంగా ఉంది. రోజురోజుకూ బోరులో నీరు తగ్గిపోతోంది. కొత్తగా 800 ఫీట్లు బోరు వేసినా.. చుక్క నీరు రాలేదు. ఎండుతున్న చేనును పశువులకు మేతగా కోసి వేస్తున్నాం.

- దొండ పాండురంగారెడ్డి, దొండగూడెం, ఇబ్రహీంపట్నం

పంటను పశువుల మేతకు వదిలేశా



రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశా. నారు వేసినప్పుడు నీరు సరిపోను ఉంది. ఫిబ్రవరి రెండోవారం నుంచి బోరులో నీరు అడుగంటి పంట ఎండిపోయింది. పశువులను మేపుతున్నా. పెట్టుబడి ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

- ఇప్పటూరు అంజయ్య, కౌలు రైతు, చేగిరెడ్డి ఘనాపూర్, చౌదరిగూడ

వరి పంట ఎండిపోయింది



బోరు కింద ఎకరన్నర పొలంలో వరి వేశా. మార్చి మొదటి వారం వరకు నీరందించిన బోరు ఒక్కసారిగా వట్టిపోయింది. కొత్తగా బోరు వేసినా నీళ్ల పడే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో పంటను వదిలేశా.

- రాంచంద్రయ్య, రైతు, గోడుగోనిపల్లి

అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టా..



యాసంగి సీజన్ ప్రారంభంలో బోరులో నీరు పుష్కలంగా ఉండటంతో ఎకరంన్నరలో వరి పంట సాగు చేశాను. పంట సాగుకోసం రూ.40 వేల వరకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టా. బోరులో నీరు పూర్తిగా అడుగంటిపోయింది. పంట ఎండిపోవడంతో చేసేదేమీ లేక వరిపొలంలో పశువులను మేపుతున్నా.

- అంజిలయ్య, బాసుపల్లి

స్ర్కాప్ షాపులో అగ్నిప్రమాదం

- తప్పిన పెను ముప్పు..
- రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం

శంషాబాద్, మార్చి 29 : స్ర్కాప్ షాపులో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న ఘటన శుక్రవారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని రాళ్లగూడలో గల ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ(ఇండేన్) సమీపంలో ఉన్న కేబీఎన్ ఐరన్, స్టీల్ అండ్ ఓల్డ్ స్ర్కాప్ దుకాణంలో ఉదయం 8.30 గంటలకు మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకుని చుట్టుపక్కల ఇళ్లలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. మంటలు అంటుకున్న గంట తర్వాత ఫైర్ ఇంజన్ రావడంతో సిబ్బంది మంటలార్పే యత్నం చేశారు. కాగా, స్ర్కాప్ షాపులో పెద్దఎత్తున సామగ్రి ఉండటంతో మంటలు భారీఎత్తున ఎగిసిపడ్డాయి. మంటలు అదుపులోకి రాకపోవడంతో మరో ఫైర్ ఇంజన్‌ను తెప్పించారు. అయినా, నీరు సరిపోకపోవడంతో స్థానికులు, అధికారులు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. శంషాబాద్-షాబాద్ ప్రధాన రోడ్డు కావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. అయితే, పక్కనే ఉన్న గ్యాజ్ ఏజెన్సీలో సిలిండర్లు ఉండటంతో.. ఒకవేళ వాటికి మంటలు అంటుకుంటాయేమోనని ప్రజలు, పోలీసులు, ఫైర్ సిబ్బంది భయందోళనకు గురయ్యారు. స్థానికులు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్లను అక్కడి నుంచి దూరంగా తరలించారు. కాగా, ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్ర్కాప్ షాపు యాజమాని ఫిర్యాదు చేశాడు. ఈమేరకు గ్యాజ్ ఏజెన్సీ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాల్‌రాజ్ తెలిపారు. దాదాపు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫైర్ సిబ్బంది పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఇళ్ల మధ్య నుంచి స్ర్కాప్ షాపును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

దేశ సమగ్రాభివృద్ధికి బీజేపీని గెలిపించండి

- మోదీని మూడోసారి ప్రధాని చేయాలి
- కాంగ్రెస్‌కు ఓటు వేస్తే 'కరప్షన్'
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- బీజేపీలో చేరిన విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరవర్గం

షాద్‌నగర్ అర్బన్, మార్చి 29 : దేశ సమగ్రాభివృద్ధి కోసం బీజేపీని గెలిపించి, మూడోసారి మోదీని ప్రధాని పీఠంపై కూర్చోబెట్టాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని కుంట్ల రాంరెడ్డి గార్డెన్‌లో శుక్రవారం సాయంత్రం మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ అధ్వర్యంలో పాలమూరు సేవా ట్రస్టు చైర్మన్ పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరవర్గం బీజేపీలో చేరింది. ఈసందర్భంగా వేలాదిగా తరలివచ్చిన విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులకు కిషన్‌రెడ్డి, డీకే అరుణలు పార్టీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఇవ్వలేదని విభేదించిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి.. మోదీని మూడోసారి ప్రధానిగా చూడాలన్న ధృడ సంకల్పంతో తిరిగి బీజేపీలో చేరడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పాలనలో పెరిగిన అవినీతి, తీవ్రవాదంతో అభివృద్ధి, సంక్షేమానికి దూరమైన దేశ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరప్షన్ పెరుగుతుందన్నారు. తొమ్మిదిన్నరేళ్ల మోదీ పాలనలో దేశం సమగ్రాభివృద్ధిని సాధించి, 5వ ఆర్థిక దేశంగా ఎదిగిందన్నారు. రహదారుల అభివృద్ధి, రైల్వేలైన్ల ఏర్పాటు, పేదరిక నిర్మూలన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూనే, తీవ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేసి, శత్రుదేశాలకు వణుకు పుట్టించారని అన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపించి, ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారత విద్యార్థులను సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ఎన్నో సున్నితమైన సమస్యలను సైతం పరిష్కరించి, భారత్‌ను ప్రపంచ దేశాలకు దీటుగా నిలిపారని అన్నారు. ఓటు వేసే ప్రతీఒక్కరు ఆలోచించాలని, గత కాంగ్రెస్ పాలనను, ప్రస్తుత బీజేపీ పాలనను బేరీజు వేసుకొని ఓటు వేయాలని కోరారు. దేశ ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న మోదీ మూడోసారి ప్రధాని కావడం కోసం బీజేపీకి ఓటువేసి డీకే అరుణమ్మను గెలిపించాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీలో చేరిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆయన అనుచరులను డీకే అరుణ ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెంది మహేందర్‌రెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, పాతపల్లి కృష్ణారెడ్డి, కె.మనోహర్‌రెడ్డి, విజయభాస్కర్, మఠం రుషికేష్, మోహన్‌సింగ్, లష్కర్‌నాయక్, సింగారం శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, వేదికపై డీకే అరుణ

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

జిల్లా పరిధిలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచే చర్చిలు, ఇళ్లల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసుక్రీస్తు బోధనలు సమస్త మానవాళికి అనుసరణీయమని పాస్టర్లు పేర్కొన్నారు. మానవత్వం, శాంతి, కరుణతో జన హృదయాల్లో శాశ్వతంగా నిలిచిన వ్యక్తి యేసు ప్రభువు అని కొనియాడారు. కార్యక్రమాల్లో క్రైస్తవ సంఘాల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల మండలం దామరగిద్ద చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్లు

హరితహారం.. బాటసారులకు ఆహ్లాదం



యాచారం మండలంలోని నందివనపర్తి-చిన్నతూండ్ల గ్రామాల మధ్య రోడ్డుకిరువైపులా కిలోమీటర్ మేర పచ్చటి చెట్లు ఏపుగా పెరిగి కనువిందు చేస్తున్నాయి. ఐదేళ్ల క్రితం హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి బాటసారులకు నీడనిస్తున్నాయి. రోడ్డువెంట వెళ్లే వారు కొద్దిసేపు ఆ చెట్ల కింద సేదతీరుతున్నారు.

- యాచారం

పల్లె ప్రకృతివనం.. మొక్కలన్నీ ఎండుముఖం



పల్లె ప్రకృతివనంలో నాటిన మొక్కలకు సకాలంలో నీరు పట్టకపోవడంతో ఎండిపోతున్నాయి. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిరలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేసి విరివిగా మొక్కలు నాటారు. కాగా, ఇటీవల సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. మొక్కలకు నీరందించి సంరక్షించడంలో అలసత్వం వహించడంతో ఎండుముఖం పట్టాయి. మొక్కలకు నీరందించి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- చౌదరిగూడ

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి దివ్యపై కేసు నమోదు

● ఎవ్వరినీ వదలబోమంటున్న కమిషనర్

మేడ్చల్ టౌన్, మార్చి 29: మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ట్యాక్స్‌డబ్బులు వాడుకున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి దివ్యపై మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదైంది. రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న అవినీతిపై ఉన్నత అధికారులు స్పందించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తగా ఇళ్ల నిర్మాణాలు, హోర్డింగ్‌ల ఏర్పాటు, వాణిజ్య పన్నుల కోసం సీఎస్‌సీ సెంటర్‌లో దరఖాస్తులు చేసుకున్న వారి వద్ద నుంచి ట్యాక్స్ రూపంలో వసూలు చేసిన రూ.26లక్షల నగదును గోల్‌మాల్ చేసిన విషయం తెలిసిందే. కాగా అవినీతికి పాల్పడ్డ సంబంధిత వ్యక్తులపై జిల్లా ఆడిట్ అధికారులు చర్యలు తీసుకునేలోపు మున్సిపల్ ఉన్నత అధికారులు డబ్బులు రికవరీ చేయడానికి పోలీసులను ఆశ్రయించారు. రూ.25లక్షల నుంచి రూ.26లక్షల మధ్య అవినీతి జరిగిందని అధికారులు ధ్రువీకరించారు. వీటిలో దాదాపు 75శాతం వరకు మేనేజర్ల నుంచి రికవరీ చేయగా మిగితా20 నుంచి 25శాతం నగదు రికవరీ చేయాల్సిఉంది. వీటిలో రూ.13.5లక్షల నిధులు గత మేనేజర్, శ్రీనివాస్, ప్రస్తుతం మేనేజర్ శ్రీదేవి వద్ద నుంచి రికవరీ చేసినట్లు తెలిసింది. దీంతో పాటు రూ.6.5లక్షల వరకు డీడీలు, చెక్కుల మున్సిపల్ ఖాతాలో జమకావటంతో మొత్తానికి గోల్‌మాల్ అయిన డబ్బుల్లో 75శాతం వరకు రికవరీ అయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

మేనేజర్లపై అనుమానాలు

నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిలో కేవలం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి దివ్యను మాత్రమే బాధ్యురాలిగా చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసి మేనేజర్లను తప్పించే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా మున్సిపల్ కార్యాలయం వ్యవహారాలను చూసుకునే మేనేజర్ ఆదేశాల మేరకే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తారు. రెండేళ్లుగా సీఎస్‌సీసెంటర్ ద్వారా ట్యాక్సుల రూపంలో వసూలు చేస్తున్న నగదుకు సంబంధించిన వివరాలు మేనేజర్లకు తెలియక పోవటం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్ల వ్యవధిలో మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ఇద్దరు మేనేజర్‌లు విధులు నిర్వహించారు. వీరిలో ఒకరు బదిలీ కాగా మరొకరు ఆయన స్థానంలో విధులు నిర్వహిస్తున్నారు. మేనేజర్లపై కేవలం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని శాఖా పరమైన విచారణ చేసి చర్యలు తీసుకునే వీలు లేకపోలేదు. మరోవైపు అవినీతికి పాల్పడిన ఎవ్వరినీ వదలబోమని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. పూర్తి విచారణ చేస్తున్నారని తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కొడంగల్, మార్చి 29: మధుకర సేవా సమితి వికారాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం కొడంగల్ పట్టణంలోని శ్రీమహదేవుని శివాయం ఆవరణలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు సేవాసమితి సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేద్దాం


మాట్లాడుతున్న బంజారా నాయకులు

కులకచర్ల, మార్చి 29: చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపునకు కలిసికట్టుగా కృషి చేద్దామని బంజార సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం కులకచర్ల మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ పదవీ కోసం కాంగ్రెస్ పార్టీ రంజీత్‌రెడ్డికి టికెట్ ఇవ్వడం సంతోషదాయకం అన్నారు. పార్లమెంట్‌లో రిజర్వేషన్‌లు, సేవాలాల్ జయంతి రోజు సెలవు దినంగా ప్రకటించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు సాల్విడ్ విఠల్‌నాయక్, ఏటీటీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాహుల్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు రవి, జేఏసీ నాయకులు గంగ్యానాయక్, శంకర్, వినోద్, బాబ్యా తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

▸ పూజలో పాల్గొన్న స్పీకర్, కూతురు, అల్లుడు

వికారాబాద్, మార్చి 29: వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఉదయం నుంచి క్యాంపు కార్యాలయంలో హోమాలు నిర్వహించగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కూతురు అనన్య చైతన్ పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో మాట్లాడి ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపించారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ ఆవిర్భావంతోనే ప్రజల్లో చైతన్యం

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 29 : తెలుగు దేశం పార్టీ ఆవిర్భావంతోనే ప్రజల్లో చైతన్యం వచ్చిందని టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు నివాసంపై టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 1982లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి, ప్రజా చైతన్యం తెచ్చారని చెప్పారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పలు సంక్షేమ పథకాలను అమలు పరిచి, తెలుగు ప్రజల కీర్తిని ప్రపంచ దేశాలకు ఎన్టీఆర్ చాటి చెప్పారని అన్నారు. రాజకీయం అంటే అధికారాన్ని అడ్డంపెట్టుకుని సంపాదించడం కాదని, ప్రజా సేవనేనని విలువలు నేర్పిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. టీడీపీతోనే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయని, అన్ని వర్గాల వారు రాజకీయంగా ఎదుగుతూ, చైతన్యవంతులయ్యారని వెంకటేశ్వర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గందం ఆనంద్, కందూరు అంజయ్యగౌడ్, మేడిగ శ్రీను, రమేష్, ఈశ్వర్‌రావు, పి. రాములుగౌడ్, భాస్కర్‌రెడ్డి, భూపతిరెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



కొండల్‌రెడ్డిని అభినందిస్తున్న న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొండల్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్‌కు గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కొండల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుర్రం సుధాకర్‌రెడ్డి ఫలితాలను ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా రాజేందర్‌రెడ్డి పామ్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ గులగారి, సంయుక్త కార్యదర్శిగా రాధాకృష్ణ బొమ్మరాజు, మహిళా సంయుక్త కార్యదర్శిగా మీనాక్షి, కోశాధికారిగా కీర్తికుమారి గుర్రంపల్లి, లైబ్రేరియన్‌గా రాములు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా అశోక్ అందేకార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్‌కుమార్‌గౌడ్, రవిబూక్యా, సందీప్ బద్దెల, శైలజ చింతల, స్వప్న కొంద్ర, వంశీ కృష్ణ బొరంపేట, విజయ్‌చంద్ర కిరణ్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుర్రం సుధాకర్‌రెడ్డి ప్రకటించారు. వీరి పదవికాలం 2024-2025 వరకు ఉంటుందన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం

▸ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

తలకొండపల్లి, మార్చి 29 : శరీర దారుఢ్యం, మానసిక వికాసానికి క్రీడలు దోహద పడుతాయని నిర్వాహకులు అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలను మాజీ సర్పంచ్‌లు కాడెమోని శ్రీశైలం, శంకర్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, సత్యంలు నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. పురుషులు, మహిళలు, విద్యార్థి విభాగాలల్లో వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రతి ఒక్కరు చేయూనందించి ప్రోత్సహించాలని వారు కోరారు. విజేత జట్ల కు మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండవ బహుమతి రూ. 20 వేలు, మూడవ బహుమతి రూ. 10 వేలు, నాలుగవ బహుమతి రూ. 5 వేలు , మహిళల ఓపెన్ కేటగిరిలో మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండవ బహుమతి రూ. 10 వేలు అందించడం జరుగుతుందని నిర్వాహకులు తిరుపతి, పీఈటీ మల్లేశ్‌తెలిపారు. తొలి రోజు మహిళల విభాగంలో గట్టిప్పలపల్లి -ఖానాపూర్ జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో మహేశ్, రాజు, వెంకటేశ్, బాలు, దుర్గ, శ్రీకాంత్, శ్రీశైలం, నర్సింహా, జంగయ్య, సాయి, మహేశ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామంలో శుక్రవారం విద్యార్థులు, యువకులకు క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల నేపథ్యంలో వంద మంది క్రీడాకారులకు గ్రామానికి చెందిన ఆర్. తిరుపతి, కె. మల్లేశ్, కుమార్ క్రీడా దుస్తులు సమకూర్చి అందజేశారు. ప్రతిభ ఆధారంగానే క్రీడాకారులకు గుర్తింపు లభిస్తుందని వారు చెప్పారు. క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీలు, విద్యార్థులు, వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులిస్తున్నా గ్రామాల్లో అభివృద్ధి లేదు

ప్రజా ఆశీర్వాద యాత్రలో బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పూడూరు, మార్చి 29: గ్రామాల అభివృద్ధికి కేంద్రం నిధులిస్తున్నప్పటికీ గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకంకాల్, చింతలపల్లిలో శుక్రవారం ప్రజా ఆశీర్వాదయాత్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను ఎంపీగా ఉన్న సమయంలో ఎన్నో గ్రామాల్లో తిరిగానని చెప్పారు. ఈప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు వేయించానని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీ పేరు చెప్పి ఓట్లు అడిగే ధైర్యం లేదన్నారు. అసాధ్యమైన హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ఉచిత బియ్యం, రైతులకు మద్దతుధర, యూరియాపై సబ్సిడీ తదితర పథకాలు కేంద్ర ప్రభుత్వం ఇస్తోందని, ప్రజలు ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. గతంలో తెలంగాణ కోసమే బీఆర్ఎస్‌లో ఉన్నానని, తెలంగాణ వస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆశపడ్డానని అన్నారు. కానీ అలా జరగలేదన్నారు. తెలంగాణ వచ్చాక ఒక కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందని ఆరోపించారు. అందుకే ఆ పార్టీని వీడానని చెప్పారు. మరోసారి మోదీ ప్రభుత్వం ఏర్పాటుకు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మరోసారి తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్ ముదిరాజ్, రవి, శ్రీశైలం, మల్లేశం, తిరుపతిరెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని మూడోసారి అధికారంలోకి తీసుకురావాలి

పరిగి: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి కేంద్రంలో మూడోసారి అధికారంలోకి తీసుకురావాలని చేవెళ్ల మాజీ ఎంపీ, బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాదయాత్రలో భాగంగా శుక్రవారం పరిగి మండలం రంగాపూర్, పరిగి, రాఘవాపూర్ తదితర గ్రామాల్లో కొనసాగింది. ఆయా గ్రామాల్లో ప్రజలతో కలిసి మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు మోదీ ఎన్నికలు కావని, దేశ ప్రజల ఎన్నికలని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ పాలనపై ప్రజలు విశ్వాసం కోల్పోయిన కారణంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. భవిష్యత్‌లో కాంగ్రెస్‌తో ఏం సాధించలేమన్నారు. దేశప్రజల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు. ప్రధాని మోదీ అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని అన్నారు. మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిగి బీజేపీ ఇన్‌చార్జి బి.మారుతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు పకడ్బందీ చర్యలు

అవసరమున్న చోట ట్యాంకర్లతో సరఫరా.. నీటి చౌర్యానికి పాల్పడే వారిపై ప్రత్యేకనిఘా

మేడ్చల్ టౌన్, మార్చి 29: వేసవి దృష్ట్యా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. వచ్చే ఏప్రిల్, మే మాసాల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చే ఆస్కారం ఉంది. దీంతో మున్సిపాలిటీ పరిధిలో అధికారులు నీటి వనరులను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా వార్డుల్లో సరఫరా చేసే మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను, పైప్‌లైన్‌ల నిర్వహణకు ప్రత్యేకంగా మున్సిపల్ సిబ్బందిని నియమించారు. రోజూ మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించి నీటి సరఫరాలో తలెత్తుతున్న లోటుపాట్లను ఎప్పటికప్పుడు సవరిస్తూ ప్రజలకు ఇబ్బందులేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలోని 23 వార్డుల్లో ప్రతీ రోజు 6.5 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో 4మిలియన్ లీటర్ల నీరు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తుండగా మిగితా 2.5మిలియన్ లీటర్ల నీటిని బోరు, బావుల ద్వారా సరఫరా చేసి ప్రజల అవసరాలను తీరుస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 11ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నందున ప్రతీ ట్యాంకు నిర్వాహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. రానున్న రెండు నెలలపాటు పూర్తి స్థాయిలో నీటి సమస్యను అధిగమించి ప్రజల అవసరాలు తీర్చడానికి సర్వం సిద్ధం చేసుకున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

అదనంగా మరో 10 వాటర్ ట్యాంకులు

మున్సిపల్ పరిధిలో అదనంగా మరో 10 వాటర్ ట్యాంకర్లను ముందస్తుగా సిద్ధం చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో నాలుగు ట్యాంకర్లు ఉన్నాయని మిషన్ భగీరథ నీటి సరఫరా లేని కాలనీలకు ఈ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో ఇప్పటికే 50విద్యుత్ మోటార్లతో నడిచే బోర్లు, 30 హ్యాండ్ బోర్లు ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలను ప్రత్యేక సిబ్బందికి అప్పగించారు. భూగర్భజలాలు అడుగంటి మున్సిపల్ బోర్లు పనిచేయని పక్షాన ప్రైవేటు వ్యక్తుల బోర్ల నుంచి నీటి సరఫరా చేయడానికి మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు.



మేడ్చల్ మున్సిపాలిటీలోని మిషన్‌భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకు

నీటిచౌర్యంపై ప్రత్యేక నిఘా

లక్ష జనాభా ఉన్న మున్సిపాలిటీ పరిధిలో నీటి కొరత లేకుండా చేయాలన్న ఉద్దేశంతో నీటి చౌర్యాన్ని నియంత్రించడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. నల్లాలకు మోటార్లు బిగించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అనుమతి లేకుండా అదనపు నల్లా కనెక్షన్‌లు ఏర్పాటు చేసుకున్న వారి కనెక్షన్‌లను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ స్వయంగా రంగంలో దిగి పలు ఇళ్లలో సోదాలు నిర్వహించి నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు ఉన్నాయి.

నీటి ఎద్దడి నివారణకు సర్వం సిద్ధం



వేసవిలో నీటి ఎద్దడి నివారణకు సర్వం సిద్ధం చేశాం. నీటి సమస్యను అధిగమించడానికి మున్సిపాలిటీ పరిధిలోని నీటి వనరులను వినియోగించడానికి తగు ఏర్పాట్లు చేశాం. ఏప్రిల్, మే నెలల్లో నీటి సమస్య తలెత్తే వీలుండటంతో ముందస్తు చర్యలు చేపడుతున్నాం. ప్రతీ కాలనీకి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. అందుకు సమగ్ర ప్రణాళికను రూపొందించాం.

డీఈ విజయలక్ష్మి



గోనూరు ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి

▸ పట్టించుకోని అధికారులు

▸ పొలాల నుంచి నీరు తెచ్చుకుంటున్న వైనం

తాండూరు రూరల్, మార్చి 29: మండలంలో తాగు నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గోనూరు గ్రామంలో తాగునీరు సరిగ్గా రాక ప్రజలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. గ్రామంలోని 8వ వార్డు ఎస్సీ కాలనీలో వారం రోజులుగా నీరు రావడం లేదు. గ్రామంలోని పలువురి ఇళ్లలో నీరు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు ఉన్నప్పటికీ 8వ వార్డు పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా మొత్తానికి నిలిచిపోయింది. దీంతో వారు ట్రాక్టర్‌కు బ్యారెల్ అమర్చి సమీప పొలాల్లోని బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రత్యేకాధికారి పట్టించుకోకపోవడం వల్లే గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో వాటర్‌మన్ ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ ద్వారా నీటిని తమ ప్రాంత కాలనీకి సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఫ్లైఓవర్ వద్దు.. అండర్ పాస్ కావాలి

పాత తాండూరు వాసుల విజ్ఞప్తి

▸ స్థిర ఆస్తులను కోల్పోతామంటూ ఆవేదన

▸ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మిస్తే మేలని సలహా

తాండూరు, మార్చి 27: పాత తాండూరు రైల్వే బ్రిడ్జిని అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తాండూరు పట్టణ మీదుగా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు పలు రకాల రైళ్ల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. పాత తాండూరు పట్టణ వాసులకు రైల్వేగేటు పడితే రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. దీంతో గంటల తరబడి పాత తాండూరు వాసులు తాండూరులోకి రావాలన్నా, పలు గ్రామాలకు వెళ్లాలన్న రైల్వే గేటు పడితే గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. ఈనెల 12వతేదీన పాత తాండూరు రైల్వే బ్రిడ్జి వంతెన నిర్మాణ పనులను స్థానికులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఫ్లైఓవర్ బ్రిడ్జి మాకొద్దని, అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మిస్తే అందరికీ మేలు జరుగుతుందని అంటున్నారు. తమ ఆస్తులు పోతే చూస్తే ఊరుకోమని తేల్చిచెబుతున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.74కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో కాంట్రాక్టర్ పనులను మొదలుపెట్టారు. దాదాపు 200వరకు ఇళ్లు కూల్చివేయాల్సి ఉండటంతో బాధితులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే మాణిక్ నగర్, మున్సిపల్ క్వార్టర్స్ వసతి గృహాల విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు, బస్తీ దవఖానాకు వచ్చే ఉద్యోగులు, సిబ్బంది, రోగులు సుమారు మూడు కిలో మీటర్ల మేర ఎక్కువగా నడవాల్సివస్తోందని వాపోతున్నారు. ఏళ్లుగా పాత తాండూరు ప్రజల కల నెరవేరబోతుందని సంతోషపడాలా? లేక స్థిరాస్తులు పోతున్నాయని బాధపడాలో? తెలియక స్థానికులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. ఒకవేళ ప్రత్యామ్నాయంగా స్థలాలు చూపించినా ఇంటి నిర్మాణానికి లక్షల్లో ఖర్చవుతుంది. ఇదిలా ఉండగా బ్రిడ్జి నిర్మాణ పనులు మాత్రం ప్రారంభమయ్యాయి. పిల్లర్లు వేసేందుకు సామగ్రి సైతం వచ్చింది. అయితే, స్థానికుల సమస్యకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చొరవ తీసుకుంటారో తెలియాల్సివుంది.



ప్రారంభమైన పాత తాండూరు రైల్వే బ్రిడ్జి



పడిన రైల్వే గేటు బ్రిడ్జి



సిద్ధమైన వేంకటేశ్వర స్వామి దేవాలయం

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

▸ ఏప్రిల్ 3 వరకు నిర్వహణ

కందుకూరు, మార్చి 29 : మండల పరిధి నేదునూరు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నేటి నుంచి ఏప్రిల్ 3 వరకు బ్రహ్మోత్సవాలకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు వేదపండితులు, ఆలయ పూజారి వట్టిపల్లి రామశర్మ తెలిపారు. ఆలయ కమిటీ ధర్మకర్త కాసుల అంజిరెడ్డి నేతృత్వంలో, ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో పద్మావతి, వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. శనివారం ఉదయం విష్వక్సేనార్చన, పుణ్యాహవాచనం, రక్షామంధనం, మత్స్యగ్రహణం, అంకురార్పణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం స్వామి వారికి అభిషేకం, ధ్వజారోహణము, అదే రోజు రాత్రి గరుడసేవ, సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆండాల్ పద్మావతి, సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రాత్రి రథోత్సవం, మంగళవారం ఉదయం 9గంటలకు కుంకుమార్చన, 11గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, శకటోత్సవం, బుధవారం ఉదయం 11:30గంటలకు పూర్ణాహుతి, సప్తావరణాలు, చక్రస్నానాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలకు నేదునూరు, మాన్యగూడ గ్రామాల భక్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

▸ డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, కేఎల్లార్

▸ జనజాతర బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

మహేశ్వరం, మార్చి 29 : లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఏప్రిల్ 6న తుక్కుగూడలో నిర్వహించే జనజాతన బహిరంగ సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి, మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. ఈమేరకు శుక్రవారం జనజాతర బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలించారు. సభ విజయవంతానికి నాయకులందరూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తుక్కుగూడలో నిర్వహించిన విజయభేరి సభ సక్సెస్ కావడంతో, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని కూడా ఇక్కడి నుంచే ప్రారంభించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించిందని చెప్పారు. బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు పలువురు జాతీయ నాయకులు హాజరవుతారని చెప్పారు. సభకు 5 లక్షల మందికి పైగా జన సమీకరణ చేయనున్నట్లు తెలిపారు. తుక్కుగూడ వేదికగా నిర్వహించిన కాంగ్రెస్ సభలన్నీ సక్సెస్ అయ్యాయని, దేశవ్యాప్త ఎన్నికల ప్రచారాన్ని కూడా తుక్కుగూడ నుంచే మొదలుపెట్టడంతో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని వారు అన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్‌దే విజయం

లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఘన విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చల్లా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం తుక్కుగూడలో మహేశ్వరం కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం, దేశాన్ని బీజేపీ ప్రభుత్వం దోపిడీ చేసిందన్నారు. చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే ప్రజలకు సేవచేసే వారినే పార్టీలో చేర్చుకోవాలని కానీ, కార్యకర్తలకు ద్రోహం చేసేవారిని మాత్రం కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిన సబితాఇంద్రారెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని పార్టీ పెద్దలకు విన్నవించానని చెప్పారు. అదేవిధంగా ఎంపీగా ఆశీర్వదించి ఆదరిస్తే మరింత సేవ చేస్తానని రంజిత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తనకు అవకాశం కల్పించిందని, ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, కప్పాటి పాండు రంగారెడ్డి, కూన యాదయ్య, కాకి ఈశ్వర్, కృష్ణానాయక్, సత్యనారాయణ, విజయలతో పాటు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న నర్సింహారెడ్డి, రంజిత్‌రెడ్డి, కేఎల్లార్

సీఎంను కలిసిన చిత్తరంజన్‌దాస్


సీఎంతో చిత్తరంజన్‌దాస్, తదితరులు

ఆమనగల్లు, మార్చి 29: మాజీ మంత్రి జక్కుల చిత్త రంజన్‌దాస్ శుక్రవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దాస్ ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎంపీ అభ్యర్థి మల్లురవితో పాటు గాంధీ భవన్‌లో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని రేవంత్‌రెడ్డి దాస్‌కు సూచించారు.

నేడు శ్రీ పంచముఖ ఆంజనేయ విగ్రహానికి శంకుస్థాపన

● పాల్గొననున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఇబ్రహీంపట్నం, మార్చి 29 : ఇబ్రహీంపట్నం చెరువు కొనకట్ట శ్రీ హరి హర అఖండ క్షేత్రంలో 108 అడుగుల శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ నిర్మాణం కోసం నేడు (శనివారం) శంకుస్థాపన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.44 గంటలకు జరిగే ఈ మహోత్సవంలో తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొంటారని వారు తెలిపారు. హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీస్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు.

ఓట్లు అడిగే నైతిక హక్కు మోదీకి లేదు


మాట్లాడుతున్న గౌరి సతీష్

మొయినాబాద్, మార్చి 29 : రాష్ట్ర ఏర్పాటును అవహేళన చేసిన ప్రధాని నరేంద్రమోదీకి తెలంగాణాలో ఓట్లు అడిగే నైతిక హక్కులేదని టీపీసీసీ స్పోక్స్ పర్సన్ గౌరి సతీష్ అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి ప్రాంతాలు, మతం పేరుతోటి ప్రజలను రెచ్చగొట్టటం ఎంత వరకు సమంజసమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. దేశ ఆర్థిక వనరులన్నింటినీ అదాని, అంబానిలకు అప్పజెప్పారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఈడీ, సీబీఐ, ఈడీ సంస్థలను ఏవిధంగా ఉపయోగించుకుంటున్నారో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు యువత సహకరించాలి


ఏసీపీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాచారం, మార్చి 29 : శాంతిభద్రతల పరిరక్షణకు యువత పోలీసులకు సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ యాచారం మండల నాయకులు ఎం నర్సింహా, బట్టుశ్రీనివాస్ తదితరులు ఏసీపీ కార్యాలయంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రాబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేట్లు ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలన్నారు. సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డివిజన్‌లో ఇప్పటికే అనేక గ్రామాల్లో స్పెషల్‌పార్టీ పోలీసులచే కవాతు చేశామన్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలు నడపరాదని, నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

త్వరలో టీడీపీకి పూర్వ వైభవం


నందమూరి రామకృష్ణతో యాదిలాల్

ఆమనగల్లు, మార్చి 29 : తెలుగు రాష్ట్రాలలో టీడీపీకి త్వరలోనే పూర్వవైభవం వస్తుందని టీడీపీ కల్వకుర్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కోశాధికారి అర్థం నర్సింహ, టీడీపీ వాణిజ్య సెల్ రాష్ట్ర కార్యదర్శి కండె సత్యం చెప్పారు.టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణను శుక్రవారం వారు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ లోని ఎన్‌టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అక్కడ జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో వారు పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌ను ఎంపీగా గెలిపించాలి

మాడ్గుల, మార్చి 29 : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీగా అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను పార్టీలకు అతీతంగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆర్ఎస్పీ సపోర్టర్స్ ఆర్గనైజర్ శ్రీధర్ గోవింద్ పిలుపు నిచ్చారు. ప్రవీణ్‌కుమార్ తన ఐపీఎస్ ఉద్యోగాన్ని వదులుకొని బడుగు బలహీన వర్గాలు బాగుపడాలని రాజకీయాల్లోకి వచ్చారన్నారు. గురుకుల పాఠశాలల కార్యదర్శిగా పనిచేసి ఎంతోమంది విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపారని గుర్తుచేశారు. మాడ్గుల మండలంలోని నాగిళ్ళ గ్రామంలో పార్టీలకు అతీతంగా సపోర్టర్స్ మీట్ అప్ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. ఆయన చట్టసభలలో ఉంటే పేదవర్గాల మరింత మేలు జరుగుతుందన్నారు. సరై నిర్ణయం తీసుకొని బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. పార్టీకు అతీతంగా నాగర్ కర్నూల్ ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలించాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అభిమానులతో ప్రతి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని శ్రీధర్ గోవింద్ చెప్పారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


కొత్తూర్ : ఫాతిమాపూర్‌లో సిలువను ఊరేగిస్తున్న క్రైస్తవులు

కొత్తూర్, మార్చి 29: మున్సిపాలిటీతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మున్సిపాలిటీలోని ఫాతిమాపూర్, మండల పరిధిలోని రెడ్డిపాలెం చర్చిలలో క్రైస్తవులు ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిలువను ఎత్తుకుని ఊరేగింపులు నిర్వహించి యేసు క్రీస్తు పాటలను పాడుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఫాతిమమాత చర్చి ఫాదర్ బోయపాటి సైమన్‌రెడ్డి, సిస్టర్ ఆరోగ్యమ్మ, మండల కోఆప్షన్ సభ్యుడు విజయ్‌పాల్‌రెడ్డి, వట్టి బాల్‌రెడ్డి, బీరెడ్డి, అల్విన్‌రెడ్డి, బాలశౌర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, యాగరెడ్డి, లుర్దూరెడ్డి, తిరుమల్‌రెడ్డి, చార్లెస్‌రెడ్డి పాల్గొన్నారు.

చేవెళ్ల : యేసుక్రీస్తును స్మరించుకోవడం ప్రతి క్రైస్తవుడి బాధ్యత అని దామరిగిద్ద నూతన అపోస్తులిక చర్చ్ పాస్టర్ బోడ సీమోన్, నర్సింలు అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండలంలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేసు క్రీస్తు సిలువ మీద ప్రాణ త్యాగం చేయడం ద్వారా ప్రపంచ మానవాళికి మోక్షం లభించిందన్నారు. ఆయన చూపించిన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోడ సామెల్, బోడ పవన్‌కుమార్, బోడ రవి, ప్రకాశ్, ప్రసాద్, ఉన్నారు.

షాబాద్ : మండలంలోని మరియాపురం, షాబాద్, బోనగిరిపల్లి, మద్దూర్, కేశవగూడ తదితర గ్రామాల్లో క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఫాదర్లు, పాస్టర్లు మాట్లాడుతూ యేసుక్రీస్తును శిలువ వేసిన రోజు జ్ఞాపకార్థంగా క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటామన్నారు. ఆయన చూపిన ప్రేమ, కరుణ, క్షమ, త్యాగ మార్గాన్ని అనుసరించడం ద్వారా వేడుకగా చేసుకుంటామన్నారు. ఫాదర్లు, పాస్టర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలు, ఇళ్లలో ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని పలువురు పాస్టర్లు పేర్కొన్నారు. ఆయన సందేశాలు అందరికీ మార్గదర్శకమని చెప్పారు. పట్టణంలోని ఇమ్మానియేల్ బంజార బైబిల్ చర్చిలో జరిగిన వేడుకల్లో పాస్టర్ ఆర్.వి.భూక్య లక్ష్మణ్ నాయక్ మాట్లాడారు. ప్రార్థనల్లో క్రైస్తవ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.


చేవెళ్ల : ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


కుంకుమార్చనలో మహిళలు

తలకొండపల్లి, మార్చి 29 : మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్చకులు రామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి నిజరూప దర్శనం, మహాభిషేకం, ప్రత్యేకపూజలు, పారాయణములు, మహాభిషేకం, నిర్వహించారు. నాయకులు కాడేమోని శ్రీశైలం, తిరుపతి, శంకర్, దోకూరు ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, కాసు శ్రీనివాస్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో జున్న సోలార్ అధినేత శేఖర్‌రెడ్డి అన్నదానం చేశారు. మాజీ సర్పంచ్ శ్రీశైలం ప్రారంభించారు.

భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన

కడ్తాల్ : మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని శ్రీ వీరాంజనేయ క్షేత్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ జ్ఞాన సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బి. వెంకటేశ్వర అధ్యక్షతన జ్ఞానప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సహస్ర నామ పారాయణం, పూజలు కొనసాగాయి. వచ్చే నెల 30 వరకు ప్రతీ రోజు ప్రత్యేక పూజలు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకురాలు కోర్పోలు లీలాలక్ష్మారెడ్డి తెలిపారు. భక్తులకు వసతులు ఏర్పాట్లు చేశామని, బాసర సరస్వతి దేవాలయం మాదిరిగా అన్మాస్‌పల్లి జ్ఞాన సరస్వతి దేవి ఆలయాన్ని తీర్చి దిద్దుతామని ఆమె చెపాపరు. కార్యక్రమంలో అర్చకులు పంకజ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పర్వతాలు, కిష్టయ్య, శంకర్, రాజు గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ దొందూ దొందే


కాంగ్రెస్‌లో చేరిన సత్తయ్య, సయ్యద్‌అలీ

చేవెళ్ల, మార్చి 29 : కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని ప్రతిపక్షపార్టీ బీఆర్ఎస్ దొందూ దందేనని, ఆ పార్టీలకు త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధిచెబుతారని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండల పరిధిలోని అజీజ్ నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు అలకుంట సత్తయ్య, సయ్యద్ అలీం ఆ గ్రామంలోని భీంభరత్ నివాసంలో ఆయన సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి, రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పురాణం వీరభద్రస్వామి, వెంకట్‌రెడ్డి, వడ్డె రాంచందర్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న భీంభరత్

చేవెళ్ల : పండుగలు సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీక అని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ హసీ కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు సోదర భావాన్ని పెంపొందిస్తాయన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, నాయకులు ఎజాస్ ఉన్నారు.

సేవా కార్యక్రమాలతో సమాజంలో గుర్తింపు

చేవెళ్ల : వేసవి ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు, కట్టమీది ప్రకాష్, కట్టమీది శ్రీను వారి తల్లిదండ్రులు కట్టమీది నర్సింహ్మ,సత్యమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం భీంభరత్ ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్టమీది ప్రకాష్, కట్టమీది శ్రీను, పురాణం వీరభద్రస్వామి, ముదిగొండ రవియాదవ్, బైకని కుమార్ యాదవ్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కంజర్ల శేఖర్, పూడురు రాజు, కుశంగ్ల నవీన్, సంగెం రాజు గౌడ్, షాబాద్ మధు, పూడురు ప్రవీణ్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్



మాట్లాడుతున్న శంకర్

చేవెళ్ల, మార్చి 29 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయెంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి. శంకర్ అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల జోన్ నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. గత ప్రభుత్వం కాలయయాపన చేసిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లు ప్రారంభిస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ చేవెళ్ల జోన్ కమిటీని ఎన్నుకున్నారు. చేవెళ్ల అధ్యక్షుడిగా శ్రీను, కార్యదర్శిగా అరుణ్, ఉపాధ్యక్షులుగా సాయి, యశ్వంత్, సాయి, అక్షిత్, సహాయ కార్యదర్శులుగా చందు, శివ, విఘ్నేష్, శివప్రసాద్, 15 మందితో కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు.

జనజాతర సభకు భారీగా కదలి రావాలి


మాట్లాడుతున్న యాట నర్సింహ

కడ్తాల్, మార్చి 29 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తుక్కుగూడలో ఏప్రిల్ 6న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జనజాతర భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ తెలిపారు. సభకు ప్రజలు అధికసంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కడ్తాల మండలం మక్తమాదారం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా రూపొందించిన మేనిఫెస్టోను తుక్కుగూడ జనజాతర సభలో ప్రకటించబోతున్నట్లు చెప్పారు. చరిత్రలో నిలిచేలా రాష్ట్ర వ్యాప్తంగా జన జాతర సభకు లక్షలాదిగా జన సమీకరణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున సభకు తరలిస్తామన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొనే సభను కాంగ్రెస్ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కోరారు. ఈ ఎన్నికల అనంతరం తెలంగాణలో బీఆర్ఎస్ కనుమరుగు కాక తప్పదన్నారు. రాష్ట్రంలో బీజేపీని ప్రజలు విశ్వసించడం లేదని చెప్పారు. సమావేశంలో నాయకులు బాల్‌రాజ్, కృష్ణానాయక్, పవన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలూరు - మహేశ్వరం రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభించి బీటీ వేస్తున్న దృశ్యం

మహేశ్వరం, మార్చి 29 : పదినెలలుగా విస్తరణకు నోచుకోని తుమ్మలూరు - మహేశ్వరం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా అనే శీర్షికతో ఈ నెల 23న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు, కాంట్రాక్టర్ స్పందించారు. పది నెలలుగా రోడ్డు విస్తరణను పక్కన పెట్టిన అధికారులు, కాంట్రాక్టర్ శుక్రవారం తుమ్మలూరు రోడ్డు పనులు ప్రారంభించారు. బీటీ రోడ్డు పనులను కూడా చేస్తున్నారు. దీంతో తుమ్మలూరు గ్రామ ప్రజలు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం


జగన్‌ను సన్మానిస్తున్న ఆనంద్, నాయకులు

ఆమనగల్లు, మార్చి 29 : ఆమనగల్లు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లేపల్లి జగన్‌ను శుక్రవారం పలువురు అభినందించారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ బ్రుంగి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జగన్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. న్యాయ వ్యవస్థ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి సత్వర న్యాయం పొందేలా బార్ అసోసియేషన్ చొరవ తీసుకోవాలని ఆనంద్ కోరారు. శ్రీకాంత్‌రెడ్డి, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, షానవాజ్‌ఖాన్, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నారాయణ, శ్రీనివాస్, చంద్రకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, మార్చి 29 :విద్యుత్ మరమ్మత్తుల దృష్ట్యా నేడు (శనివారం) కందుకూరు టౌన్ ఫీడర్‌లో కరెంట్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రమేష్‌గౌడ్ తెలిపారు. కందుకూరు టౌన్ ఫీడర్.2 11కేవి, పరిధిలోని దెబ్బడగూడ, మహ్మద్‌నగర్, ఇండస్ట్రీలకు శనివారం ఉదయం 8:30గంటల నుండి 9:30గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఈ అసౌకర్యానికి రైతులు, గృహ విద్యుత్ వినియోగదారులు, ఇండస్ట్రీ నిర్వాహకులు సహకారించాలని కోరారు.

వంశీచంద్‌రెడ్డి గెలవాలని అజ్మీర్ దర్గాలో పూజలు


చాదర్ సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తూర్, మార్చి 29 : కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చల్లా వంశీచంద్‌రెడ్డి ఎన్నికల్లో గెలుపొందాలని కోరుతూ మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రముఖ అజ్మీర్‌దర్గాలో చాదర్, పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందాలని ప్రార్థనలు నిర్వహించినట్లు నాయకులు చెప్పారు. ప్రార్థనల్లో సయ్యద్ హబీబ్, నసీర్, నియాజ్, మహ్మద్ హబీబ్, ఆర్బాజ్, హరూన్ ఉన్నారు.

తమపై దాడి చేసినా పట్టించుకోని పోలీసులు

●బాధితుల ఆరోపణ

చేవెళ్ల, మార్చి 29 : తమపై దాడి చేశారని శంషాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని బాధిత మహిళలు దిద్యాల పద్మమ్మ, సరిత ఆరోపించారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ మండల పరిధిలోని పెద్దతూప్ర గ్రామానికి చెందిన తమపై అదే గ్రామానికి చెందిన కట్కూరి నందు, కట్కూరి సురేష్, కట్కూరి ముఖేష్, కట్కూరి పుణ్యవతిలు రోడ్డు విషయంపై ఈ నెల 23న దాడి చేశారని చెప్పారు. ఈ విషయంపై అదే రోజు శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సీసీ ఫుటేజీ ఆధారాలతో తాము ఫిర్యాదు చేసినా ఇప్పటికీ వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయలేదని బాధితులు ఆరోపించారు. తమకు న్యాయం జరగకపోతే సైబరాబాద్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కాగా ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, ఫిర్యాదు రాగానే ఏఎస్సైని విచారణకు పంపించగా ఆయన పూర్తి వివరాలు సేకరించారని సీఐ నరేందర్‌రెడ్డి మీడియాతో చెప్పారు. కేసు నమోదు కోసం కోర్టు అనుమతి కోరామని, అనుమతి రాగానే కేసు నమోదు చేస్తామని ఆయన చెప్పారు.

క్రైం కార్నర్

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు, రిమాండ్

●3.2 కిలోల గంజాయి, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం


నిందితులను చూపుతున్న పోలీసులు

ఆదిభట్ల, మార్చి 29 : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 3.2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాదు దూల్‌పేట్‌కు చెందిన రాజాసింగ్ కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తూ గంజాయి తీసుకోవడానికి అలవాటు పడ్డాడు. దీంతో తాను కూలీ చేసి సంపాదించే డబ్బులు సరిపోక నివాసం ఉండే ఏరియాలోనే ఆశీష్‌సింగ్, భీజ్మాభాయి అనే వ్యక్తుల నుంచి కిలో రూ.10 వేలు చొప్పున గంజాయి కొనుగోలు చేసి కిలో రూ.15 వేలు చొప్పున అమ్మడం ప్రారంభించాడు.అదే క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నుంచి వలస వచ్చి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, ఇంజాపూర్‌లో ఉంటూ కూలీ చేసుకునే ఉప్పు లోకేశ్వర్ రాజాసింగ్ ద్వారా ఆరు నెలలుగా గంజాయి కొనుగోలు చేసేవాడు. కాగా గంజాయి వ్యాపారం చేసి అక్రమ మార్గంలో రాజాసింగ్ డబ్బులు సంపాదిస్తున్నాడని తాను కూడా అతని నుంచి గంజాయి కొనుగోలు చేసి 50 గ్రాముల ప్యాకెట్లుగా చేసి ఆదిభట్ల పరిసర ప్రాంతంలోని కంపెనీల్లో పనిచేసే వారికి విక్రయించేవాడు. వారం క్రితం రాజాసింగ్ ద్వారా 1.5 కిలోల గంజాయి కొనుగోలు చేసి ఆదిభట్లలోని వివిధ సంస్థల్లో పనిచేసే కూలీలకు లోకేశ్వర్ విక్రయించాడు. గతంలో అతని నుంచి గంజాయి కొనుగోలు చేసిన వారు ఈసారి 4 కిలోలు కావాలని లోకేష్‌ను అడిగారు. తన దగ్గర 1.2 కిలోలు మాత్రమే ఉండటంతో మిగతా గంజాయి కోసం రాజాసింగ్‌ను లోకేశ్వర్ సంప్రదించాడు. రాజాసింగ్ వద్ద 2 కిలోలు గంజాయి ఉందని గురువారం సాయంత్రం ఆదిభట్ల శివారులోని బీరప్పగుడి వద్దకు తీసుకు వస్తానని లోకేశ్వర్‌తో చెప్పాడు. గంజాయి విక్రయించేందుకు వస్తున్న విషయం పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ వెంకటేష్ తన సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.40 వేలు విలువచేసే 3.2 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

స్క్రాప్ గోదాంలో మంటలు

షాద్‌నగర్‌రూరల్, మార్చి 29 : షాద్‌నగర్ పట్టణ శివారులోని మిలీనియం టౌన్‌షిప్ సమీపంలోని ఓ స్క్రాప్ గోదాంలో శుక్రవారం విద్యుదాఘాతంతో మంటలు అంటుకున్నాయి. చిల్లరగా కొన్న స్క్రాప్‌ను ఇక్కడ డంప్ చేస్తారు. కాగా విద్యుదాఘాతంతో మంటలు అంటుకోవడంతో దట్టమైన పొగ కమ్ముకుంది. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు.

ఎక్సైజ్ దాడులు.. నలుగురి అరెస్టు

● 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం


నిందితులతో ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్, తదితరులు

ఆమనగల్లు, మార్చి 29 : ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శుక్రవారం ఆ శాఖ అధికారులు సారా తయారీ కేంద్రాలపై విస్తృత దాడులు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నాటు సారా తయారీ, విక్రయాలను నిర్మూలించేందుకు, అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు దాడులు చేపట్టారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి ఆదేశానుసారం డిప్యూటి కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ కిషన్ ఆధ్వర్యంలో ఐదు బృందాలుగా ఏర్పడి ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల మండలాల్లో దాడులు నిర్వహించారు. మాడ్గుల మండలం కాట్రావత్ తండా, కొర్ర తండాలలో నిర్వహించిన దాడులోకల 8 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని బాల్‌రామ్, శంకర్ , గోపాల్, మాలిక్ అనే వ్యక్తులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. కొర్ర తండాలో 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఆయన చెప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఫంక్షన్ హాల్స్, ఫాంహౌజ్‌ల్లో అనుమతులు లేకుండ మద్యం సేవిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నాటు సారా తయారు చేసినా, విక్రయించినా, 8712658742 , 9000571671 ఫోన్ నెంబర్లకు సమాచారమందించాలని సూచించారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఇన్‌చార్జి చంద్రశేఖర్, డీటీఎఫ్ సరూర్ నగర్, మహేశ్వరం, ఇబ్రాహీంపట్నం టీంల ఇన్‌చార్జిలు సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, సీతారామ్‌రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బంధువుల ఇంటికి వెళ్లిన మహిళ అదృశ్యం


యాదమ్మ

చేవెళ్ల, మార్చి 29 : బంధువుల ఇంటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన శుక్రవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాల్మాకులకు చెందిన గూడెపు యాదమ్మ(48) ఈ నెల 27న శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని రాళ్లగూడలో ఉన్న తన బంధువుల ఇంటికి వచ్చింది. అక్కడి నుంచి అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు తిరిగి ఇంటికి వెళుతున్నానని చెప్పి రాళ్లగూడలో బస్సు ఎక్కింది. కానీ ఇంటికి రాకపోవడంతో కంగారు పడ్డ కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికిన ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఒంటిపై బంగారు అభరణాలు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసినవారు శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారమందించాలని చెప్పారు.

చేవెళ్లలో అర్ధరాత్రి దొంగల బీభత్సం

● ఐదు షాపుల్లో రూ.50 వేలకుపైగా నగదు చోరీ

చేవెళ్ల, మార్చి 29 : చేవెళ్ల పట్టణ కేంద్రంలో గుర్తుతెలియని దొంగలు గురువారం అర్ధరాత్రి బీభత్సం చేసి ఐదు షాపుల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ఐదు షాపుల్లో రూ. 50 వేలకుపైగా నగదుతో పాటు విలువైన వస్తువులను దొంగలు కాజేశారు. దీంతో బాధితులు బోరుమంటూ చేవెళ్ల పోలీస్‌లను ఆశ్రయించారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో జరగడం గమనార్హం. చేవెళ్ల ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శాంతిమణి ట్రాన్స్‌ఫర్ షాపుపై ఉన్న ఇనుప రేకులను వంచి దుండగులు లోపలికి దిగి అందులో ఉన్న సీసీ ఫుటేజీకి సంబంధించిన హార్డ్‌డిస్క్, ఇంటర్‌నెట్ బాక్స్‌తోపాటు రూ.10వేలు నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. అదే వరుసలో ఉన్న మణికంఠ ట్రేడర్స్ అనే షాపులో రూ.10 వేలు నగదు, కిరాణం సామాన్లు దొంగిలించారు. మరో కూల్ పాయింట్, జనరల్ షాపులో ఇంటర్‌నెట్ బాక్స్‌తోపాటు కొంత నగదు పోయింది. శ్రీ బాలాజీ స్టీల్, సిమెంట్ షాపులో రూ.11 వేలు నగదుతోపాటు సీసీ ఫుటేజీ హార్డ్‌డిస్క్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో పాటు రమేశ్ లాండ్రీ షాపులో సైతంపై రేకులు ఊడదీసి లోపలికి చొరబడి అందులో ఉన్న కొంత నగదుతోపాటు ఐరన్ బాక్స్‌ను ఎత్తుకెళ్లారు. అయితే శుక్రవారం ఉదయం ఆయా దుకాణాల యాజమనులు వారి షాపులు తెరిచి చూడా షాపుపై కప్పు రేకులు తెరిచి ఉండటంతో పాటు వస్తువులన్నీ చిందర వందరగా ఉండటం చూసి వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించారు. దీంతో పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన షాపులను పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.